క్లుప్తంగా

దుర్గ మృతికి సంతాపం



దుర్గ కుటుంబాన్ని పరామర్శిస్తున్న జేపీ

కర్త మామిళ్ల దుర్గ ఇటీవల మృతి చెందింది. శనివారం ఏలూరులోని ఆమె స్వగృహానికి వైఎస్సార్ సీపీ ఏలూరు సమన్వయకర్త మామిళ్లపల్లి జయప్రకాష్ (జేపీ) వెళ్లి ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి సంతాపం తెలిపారు. ఆమె కుటుంబ సభ్యులను పరామర్శించి, పార్టీ అండగా ఉంటుందని భరోసా కల్పించారు. నాయకులు గుడిదేశి శ్రీనివాసరావు, నూకపెయ్యి సుధీర్‌బాబు, కిలాడి దుర్గారావు, భాస్కర్ల బాచి, జనార్థన్, యర్రా రాంబాబు, ఇలియాస్ బాషా, సృజన్, కింజింగి రాజు, వెంకటేష్, మల్లిక్, బసవ, కడలి పాండురంగారావు, యక్కల నాని, హేమకుమార్ తదితరులు ఉన్నారు.

ఐక్యతతోనే సంఘాల అభివృద్ధి



డివిజనల్ డీడీడబ్ల్యూఎంను కలిసిన కోర్ సభ్యులు

దెందులూరు : ఐక్యత ప్రణాళికతోనే మహిళా సంఘాల అభివృద్ధి బలోపేతమవుతాయని సాల్వేషన్ ఆర్మీ ఏలూరు డివిజనల్ డీడీ డబ్ల్యూఎం మేజర్ లత అన్నారు. శనివారం ఆమెను సాల్వేషన్ ఆర్మీ సెంట్రల్ కోర్ ట్రెజరర్ మాజీ సర్పంచ్ లీనా ప్రశాంతి, సెంట్రల్ కోర్ సభ్యులు కలిశారు. సెంట్రల్ కోర్‌లో గృహ సమితి సభ్యులు సంఘాల ప్రణాళిక, గృహ సందర్శన, ర్యాలీలు, సభలు సమావేశాలను వివరించారు. మహిళా సంఘాల అభివృద్ధి బలోపేతానికి సహకరిస్తామని ఆమె అన్నారు.

ఆయుష్ హాస్పిటల్‌కు ఎన్‌ఏబీహెచ్ గుర్తింపు

ఏలూరు టౌన్ : స్థానిక అశోక్‌నగర్‌లోని ఆయుష్ హాస్పిటల్ దేశంలోనే ప్రతిష్టాత్మకమైన నేషనల్ అక్రిడిటేషన్ బోర్డ్ ఫర్ హాస్పిటల్స్ అండ్ హెల్త్‌కేర్ (ఎన్ఏబీహెచ్) గుర్తింపు సాధించిందని హాస్పిటల్ చైర్మన్ డాక్టర్ యార్లగడ్డ రమేష్‌బాబు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన హాస్పిటల్స్‌లో శనివారం విలేకర్లతో మాట్లాడారు. హాస్పిటల్‌లోని సుమారు 651 అంశాలపై ఎన్ఏబీహెచ్ బృందం పరిశీలించిన అనంతరం అక్రిడిటేషన్ ఇచ్చారని చెప్పారు. దేశంలో సుమారుగా 1550 హాస్పిటల్స్‌కు మాత్రమే ఎన్ఏబీహెచ్ గుర్తింపు ఉండగా ఏలూరు లాంటి టైర్-2 నగరంలో ఈ గుర్తింపు రావటం తమ ప్రతిభకు గుర్తింపు అన్నారు. హాస్పిటల్స్ వైస్ చైర్మన్ పీఎస్ శ్రీనివాస్ చౌదరి, ఆయుష్ వైద్యులు దశరథ్ బొప్పన, అక్కిన శ్రీరామ్ మాట్లాడారు. చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ అధికారి మేడా జయలక్ష్మి పాల్గొన్నారు.

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	18	అరటి కాయ (1)	06-08
వంకాయలు (గులాబీ)	26	చిక్కుడు కాయలు	90
వంకాయలు (కాంతులు)	30	బీన్లచిక్కుడు	--
వంకాయలు (తెలుపు)	38	చామదుంపలు	50
బెండకాయలు	26	ములక్కాడలు	08, 10
పచ్చిమిర్చి	30	కంద	--
కాకర కాయలు	40	బీట్‌రూట్	36
బీరకాయలు	40	కీరా దోస	40
బీరకాయలు (పందిరి)	48	ఫ్రెంచ్‌బీన్స్	90
క్యాబేజీ	20	అల్లం	60
క్యారెట్	40	కొత్తిమీర (కట్ట)	25
దొండకాయలు	20	పాలకూర	12
బంగాళదుంపలు	30	తోటకూర	10
ఉల్లిపాయలు	22	చుక్కకూర	12
గోరుచిక్కుడు	38	గోంగూర	07-10
దోసకాయలు	20	పుదీనా	05
ఆనబకాయ (1)	10-15	క్యాప్సికమ్	70
పొట్లకాయ(1)	20	చిలకడదుంప	40

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్ఈఎల్ (ఇంద్ర)	21.00	05
ఏలూరు - జీడిమెట్ల (ఖమ్మం) (ఇంద్ర)	20.15	01
ఏలూరు - జీడిమెట్ల (ఈసీఐఎల్) (ఇంద్ర)	21.30	09
ఏలూరు -బీహెచ్ఈఎల్ (అమరావతి)	22.00	22

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్ఈఎల్	21.45	4820	06
ఏలూరు -బీహెచ్ఈఎల్	21.15	4822	03
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా కే.కోట	19.30	4796	00
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా రామచంద్రపురం	10.45	4798	00
ఏలూరు - బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	00
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	04
ఏలూరు - బీహెచ్ఈఎల్ (ఖమ్మం)	20.00	98516	34
ఏలూరు - బీహెచ్ఈఎల్	22.10	98507	34
ఏలూరు - తిరుపతి	16.00	4830	31

కరోనా భయం వద్దు.. జాగ్రత్తలే ముద్దు

- ఏలూరు జీజీహెచ్‌లో కోవిడ్ ప్రత్యేక వార్డు
- కరోనా పరీక్షలకు వీఆర్‌డీఎల్ ల్యాబ్ సిద్ధం



కరోనా పరీక్షల ల్యాబ్



ఏలూరు జీజీహెచ్‌లో ఏర్పాటు చేసిన కోవిడ్ వార్డు



కరోనా పరీక్షల యంత్ర పరికరం

ఏలూరు టౌన్: కోవిడ్-19 మహమ్మారి ప్రపంచాన్ని ఒకసారి పట్టి కుదిపేసింది. విలయతాండవం చేస్తూ జనాల్ని భయభ్రాంతులకు గురిచేసింది. దీంతో బతుకుజీవుడా అంటూ ప్రపంచమే అరిటాకులా వణికిపోయింది. కరోనా మరోసారి కోరలు చాస్తుందనే వార్తలు జనాలను ఆందోళనకు గురిచేస్తున్నాయి. రాష్ట్రంలో కడప, విశాఖపట్నంలోనూ ఇప్పటికే కరోనా పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. చాపకింద నీరులా కరోనా మళ్లీ విస్తరిస్తూ ప్రజల ఆరోగ్యాలపై తీవ్ర ప్రభావం చూపిస్తుందనే భయం ప్రజల్లో ఉంది. మరోవైపు కరోనాపై కూటమి ప్రభుత్వం ఏ విధమైన ముందుస్తు జాగ్రత్త చర్యలు తీసుకోలేదు. కానీ ఏలూరు జీజీహెచ్‌లో వైద్యులు ముందుస్తు చర్యలకు ఉపక్రమించారు.

20 బెడ్లతో ప్రత్యేక వార్డు

ఏలూరు సర్వజన ఆసుపత్రిలో కరోనా సోకితే ఏదైనా ఆరోగ్యస్థితి ప్రమాదకరంగా ఉంటే ప్రత్యేక వైద్య చికిత్స అందించేందుకు కోవిడ్ వార్డు ఏర్పాటు చేశారు. 20 బెడ్లతో కూడిన వార్డును సిద్ధం చేశారు. కరోనా చికిత్సకు వార్డును ఏర్పాటు చేశారు. అత్యవసర పరిస్థితి ఏర్పడితే మరో వార్డు సైతం అందుబాటులో ఉంచారు. కరోనా సోకిన వారికి శ్వాసకోశ వ్యాధులు తీవ్రమైతే ఆక్సిజన్ బెడ్లు కూడా ఏర్పాటు చేశారు. తొలుత ఏలూరు జీజీహెచ్ భవనంలోని డీసీహెచ్ఎస్ కార్యాలయం సమీపంలో ఒక వార్డు సిద్ధంగా ఉంది.

అందుబాటులో కరోనా పరీక్షల కిట్లు

ఏలూరు జీజీహెచ్‌లోని వీఆర్‌డీఎల్ ల్యాబ్‌ను సిద్ధం చేశారు. కరోనా లక్షణాలతో ఎవరైనా హాస్పిటల్‌కు వస్తే వారికి కరోనా టెస్టులు చేసేందుకు ల్యాబ్‌ను రెడీ చేశారు. టెక్నీషియన్లను అందుబాటులో ఉంచారు. ప్రస్తుతం 500 కరోనా పరీక్షల కిట్లు అందుబాటులో ఉంచారు. పాజిటివ్ కేసులు అధికంగా ఉంటే వాటికి అనుగుణంగా పరీక్షల కిట్లను తీసుకొచ్చేందుకు చర్యలు చేపట్టారు. సాధారణ టెస్టులతో పాటు, వీఆర్‌డీఎల్ పరీక్షలు చేసేందుకు ల్యాబ్ యంత్ర పరికరాలను సిద్ధం చేశారు.

ఆందోళన వద్దు

కోవిడ్ వైరస్ పట్ల ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. జాగ్రత్తలు పాటించాలి. కరోనా లక్షణాలు ఉంటే వైద్యులను సంప్రదించి, చికిత్స పొందాలి. మాస్క్ ధరించాలి. జనం అధికంగా ఉండే ప్రాంతాలకు దూరంగా ఉండాలి. చేతులు పరిశుభ్రంగా ఉంచుకోవాలి. జ్వరం, జలుబు, ఒంటి నొప్పులు, గొంతు నొప్పి, శ్వాస తీసుకోవటంలో ఇబ్బంది ఉంటే వైద్యులను సంప్రదించాలి. దీర్ఘకాలిక వ్యాధితో బాధపడేవారు, వృద్ధులు, చిన్నారుల పట్ల జాగ్రత్తలు పాటించాలి.

– డాక్టర్ సావిత్రి, మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్, జీజీహెచ్ ఇన్‌చార్జి సూపరింటెండెంట్, ఏలూరు

మానవత్వంతో కూడిన చికిత్స అందించాలి



అవగాహనా కార్యక్రమంలో పాల్గొన్న వైద్యులు

ఏలూరు (టూటౌన్): ప్రపంచ స్కిజోఫ్రెనియా దినోత్సవం సందర్భంగా స్థానిక జిల్లా దివ్యాంగుల పునరావాస కేంద్రం వారు ఏలూరు సర్వజన ఆసుపత్రిలో శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హెచ్‌వోడీ డాక్టర్ సీహెచ్ వంశీ కృష్ణ, డాక్టర్ ప్రసాద్ రెడ్డి పాల్గొని మాట్లాడారు. ప్రపంచ స్కిజోఫ్రెనియా దినోత్సవాన్ని నేషనల్ స్కిజోఫ్రెనియా ఫౌండేషన్ స్థాపించిందన్నారు. మానసిక అనారోగ్యంతో బాధపడుతున్న వ్యక్తులకు మరింత మానవత్వంతో కూడిన చికిత్స కోసం ప్రారంభ ఉద్యమంలో కీలక వ్యక్తి అయిన ఫ్రెంచ్ వైద్యుడు డాక్టర్ ఫిలిప్ పినెల్ (1745-1826)ను గౌరవించడం దీని ముఖ్య ఉద్దేశమని తెలిపారు. 2025 సంవత్సరానికి స్కిజోఫ్రెనియా చికిత్స, పరిశోధనలో సరికొత్త పద్ధతులను ఉపయోగించి, వ్యక్తిగత అవసరాలకు అనుగుణంగా చికిత్స అందించే ప్రయత్నాలను తెలిజేస్తోందని వివరించారు. సంస్థ కో ఆర్డినేటర్ డి.శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ స్కిజోఫ్రెనియా మెదడుకు సంబంధించిన రుగ్మతని, దీని ప్రధాన లక్షణాలను వివరించారు. ఏలూరు సర్వజన ఆసుపత్రి సిబ్బంది, డీడీఆర్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

స్వాతంత్య్ర సమరయోధుల జీవితాలు స్ఫూర్తిదాయకం



విద్యార్థులకు నీతి కథలు వివరిస్తున్న రీసోర్స్ పర్సన్లు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్వాతంత్య్ర సమరయోధుల జీవితాలను తెలుసుకుంటే ఎంతో స్ఫూర్తినిస్తాయని రీసోర్స్ పర్సన్ ఐ.శ్రీనివాసరావు తెలిపారు. స్థానిక జిల్లా కేంద్ర గ్రంథాలయంలో నిర్వహిస్తోన్న వేసవి విజ్ఞాన శిక్షణ తరగతులు శనివారం 22వ రోజు కొనసాగాయి. ముందుగా చిన్నారులకు పుస్తక పఠనంలో రకరకాల నీతికథలను చదివించారు. రిసోర్స్ పర్సన్ శ్రీనివాసరావు విద్యార్థులకు స్వాతంత్య్ర సమరయోధులు మహాత్మా గాంధీజీ 19 సంవత్సరాల వయస్సులోనే న్యాయశాస్త్ర విద్యాభ్యాసానికి ఇంగ్లాడ్ వెళ్లారని, ఆ సమయంలో కన్నతల్లికి ఇచ్చిన మాట ప్రకారం మాంసానికి, మద్యానికి దూరంగా ఉన్నారని వివరించారు. ఎంతో కష్టపడి స్వాతంత్య్రం మనకు అందించిన మహోన్నతమైన వ్యక్తిగా ఎదిగారని తెలిపారు. మరో వ్యక్తి అబ్రహం లింకన్ కూడా అతిపేద కుటుంబం నుంచి వచ్చిన వ్యక్తి కన్నతల్లికి ఇచ్చిన మాట ప్రకారంగా ఎన్నో కష్టాలను అనుభవించి అమెరికా దేశ అధ్యక్షుడయ్యారని, వీరు తల్లికిఇచ్చిన మాటప్రకారం ఆ స్థాయికి చేరుకోగలిగారని వివరించారు. రిసోర్స్ పర్సన్ పి.అనురాధ విద్యార్థులకు నీతికథలను బోధించారు. క్రమశిక్షణతోనే ఎదైనా సాధ్యపడుతుందన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ లైబ్రేరియన్ ఎ.నారాయణరావు, బి.రమేష్, ఎండీ అస్లాం పాషా, ఎం కనకదుర్గ, విద్యార్థులు పాల్గొన్నారు.

అర్హత ఉన్న ప్రతి ముస్లింకూ పథకాలు

ఏలూరు (టూటౌన్): ఏలూరు జిల్లాలో వివిధ కార్యక్రమాల్లో ఏపీ రాష్ట్ర మైనార్టీల వ్యవహారాల ప్రభుత్వ సలహాదారు ఎంఏ షరీఫ్ శనివారం పాల్గొన్నారు. తొలుత రెవెన్యూ అతిథి గృహానికి చేరుకున్న షరీఫ్‌కు జిల్లా మైనారిటీల సంక్షేమ అధికారి ఎస్ఎస్ కృపావరం మర్యాపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. అనంతరం మైనారిటీల సంక్షేమ శాఖ ద్వారా ముస్లింల సంక్షేమానికి అమలు చేస్తోన్న వివిధ కార్యక్రమాల అమలుపై అధికారులతో షరీఫ్ సమీక్షించారు. అర్హులైన ప్రతి ముస్లింకు సంక్షేమ పథకాలు అందించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం వివిధ సమస్యలపై జిల్లాలోని వివిధ ముస్లిం సంఘాల నాయకులు అందించిన వినతి పత్రాలను స్వీకరించి, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని షరీఫ్ అధికారులను ఆదేశించారు. అనంతరం తంగెళ్లమూడి మర్కజ్ మసీద్‌కు వెళ్లి నమాజ్ చేశారు. అనంతరం ఏలూరు నుంచి తాడేపల్లి బయలుదేరి వెళ్లారు. కార్యక్రమంలో పలు ముస్లిం సంఘాల నాయకులు పాల్గొన్నారు.

రైతులను దోచుకుంటున్న దళారులు



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు కుమార స్వామి

ఏలూరు (టూటౌన్): ధాన్యంలో తేమశాతం 20 శాతం ఉన్నప్పటికీ కొనుగోలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు ఇవ్వడం అభినందనీయమని, కానీ ఆ ఫలాలు రైతులకు చేరకుండా దళారులు రైతులని అడ్డగోలుగా దోచుకుంటున్నారని కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు చిగురుపాటి కుమారస్వామి ఆరోపించారు. స్థానిక బీజేపీ జిల్లా కార్యాలయంలో కిసాన్ మోర్చా ఏలూరు జిల్లా అధ్యక్షుడు కీర్తి రామ్ ప్రసాద్ ఆధ్వర్యంలో శనివారం ఏనిర్వహించిన కిసాన్ మోర్చా విస్తృత స్థాయి కార్యకర్తల సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. రానున్న రోజుల్లో బీజేపీ కిసాన్ మోర్చాని క్షేత్రస్థాయిలో బలపరచాలని అన్నారు. ప్రతి గ్రామానా అధ్యక్షుల్ని నియమించాలని సూచించారు. కీర్తి రామ్ ప్రసాద్ మాట్లాడుతూ ధాన్యం కొనుగోళ్లలో దళారుల అరాచకాలని నిలుపుదల చేయాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు చౌటపల్లి విక్రమ్ కిషోర్, కట్నేని కృష్ణ ప్రసాద్, పెన్మెత్స రామచంద్ర రాజు, పాకలపాటి రవిరాజు, రాయంకుల చక్రదర రావు, ఉండవల్లి వెంకట్రావు, మేకల కృష్ణ దేవరాయలు తదితరులు పాల్గొన్నారు.

అనాథ బాలల గుర్తింపునకు ప్రత్యేక కమిటీ



సదస్సులో మాట్లాడుతున్న బుల్లి కృష్ణ

ఏలూరు (టూటౌన్): బాలలంతా గుర్తింపు కార్డు కలిగి ఉండాలని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఇన్‌చార్జి కార్యదర్శి, ప్రిన్సిపల్ సివిల్ జడ్జ్ (సీనియర్ డివిజన్) కేకేవీ బుల్లి కృష్ణ అన్నారు. శనివారం ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని సంబంధిత అధికారులతో అనాథ బాలలకు ఆధార్ కార్డు రిజిస్ట్రేషన్, న్యాయ సాధికారిత అనే అంశంపై స్థానిక జిల్లా న్యాయ సేవాధికార సంస్థ భవనంలో ఏర్పాటుచేసిన అవగాహన సదస్సులో బుల్లి కృష్ణ మాట్లాడారు. జిల్లాలో అనాథ, సామాజికంగా, ఆర్థికంగా వెనకబడిన, గుర్తింపు కార్డు లేని బాలలను గుర్తించి వారికి గుర్తింపు కార్డు/ఆధార్ కార్డు మంజూరు చేయించాలన్నారు. ఈ ప్రక్రియకు న్యాయ, రెవెన్యూ, వైద్య శాఖలు, పానల్ లాయర్లు, పారా లీగల్ వలంటీర్లతో కమిటీ (సాథి) ఏర్పాటు చేశామన్నారు. అధికారులు న్యాయ సేవాధికార సంస్థ సమన్వయం చేసుకుంటూ ఈ ప్రక్రియలో భాగం కావాలని సూచించారు.

నేడు తప్పిపోయిన పిల్లల దినోత్సవం

జాతీయ తప్పిపోయిన పిల్లల దినోత్సవం సందర్భంగా ఆదివారం సంబంధిత అధికారులు ప్రత్యేక తనిఖీలు నిర్వహించాలని బుల్లి కృష్ణ సూచించారు. ప్రస్తుత సమాజంలో బాలల అక్రమ రవాణా పెరిగిపోయిందని, దీనిని అరికట్టడానికి జిల్లా న్యాయశాఖ అధికారులు సంయుక్తంగా కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని అన్నారు. ఏలూరు జిల్లా ఉమెన్ డెవలప్‌మెంట్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ అధికారి పి.శారద, ఏలూరు జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ సూర్య చక్రవేణి, పశ్చిమగోదావరి జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

మాధవి ఆత్మహత్యకు కారకులైన వారిని శిక్షించాలి



వైఎంహెచ్ఏ సెంటర్‌లో ధర్నా చేస్తున్న ఐఎఫ్‌టీయూ నాయకులు, కార్యకర్తలు

ఏలూరు (టూటౌన్): తుంపాల మాధవి ఆత్మహత్యకు కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని కోరుతూ ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో కుటుంబ సభ్యులతో కలిసి ఆందోళన చేశారు. ఈ ఘటనకు బాధులైన గెడ్డం సంతోష్ తల్లిదండ్రులు లుకరాజు, బాప్పిబాలను అరెస్టు చేయాలని కోరుతూ శనివారం ఏలూరు వన్‌టౌన్ ఏరియా రైతు బజార్ నుంచి పోలీస్ స్టేషన్ మీదుగా ఎల్ఐసీ ఆఫీస్, వైఎంహెచ్ఏ హాల్ పక్కనున్న లాగుడు బండ్ల ఆఫీసు వద్దకు, నాలుగు రోడ్ల కలిసి ఉండే సెంటర్ వరకు ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఏలూరు రూరల్ ఎస్సై దుర్గాప్రసాద్ అక్కడికి చేరుకుని సంతోష్ తల్లిదండ్రులను సాయంత్రానికి అరెస్టు చేస్తామని మాధవి కుటుంబ సభ్యులు, ఇఫ్టూ కార్యకర్తలకు హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఇఫ్టూ ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ప్రధాన కార్యదర్శి బద్దా వెంకట్రావు, ఏలూరు నగర ప్రధాన కార్యదర్శి యర్రా శ్రీనివాసరావు మాట్లాడుతూ గెడ్డం సంతోష్ ప్రేమ పేరుతో మాధవిని ఐదేళ్లుగా వంచించి మోసం చేశాడన్నారు. లుకరాజు, భార్య కుటుంబ సభ్యుల వ్యవహార శైలితో మనస్థాపానికి గురై మాధవి ఆత్మహత్యకు పాల్పడిందన్నారు. సంతోష్ తల్లిదండ్రులపై కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. మాధవి కుటుంబానికి హోం మంత్రి అనిత భరోసా కల్పించాలని కోరారు. జైల్లో ఉన్న సంతోష్‌ను చట్ట ప్రకారంగా శిక్షించాలని న్యాయమూర్తులను కోరారు. కార్యక్రమాలో తుంపాల మాధవి తల్లిదండ్రులు శివ నాగరాజు, కనకమహాలక్ష్మి, బంధువులు మౌనిక, ముత్యాల దుర్గాప్రసాద్, కోయల వరలక్ష్మి, సీత, భవాని, తలారి లక్ష్మి, తుంపాల దుర్గమ్మ తదితరులు పాల్గొన్నారు.

కోకోకు అంతర్జాతీయ మార్కెట్ ధర చెల్లించాలి



దేగా ప్రభాకర్

ఏలూరు (టూటౌన్): కోకో గింజలకు అంతర్జాతీయ మార్కెట్ ధర చెల్లించాలని రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు డేగా ప్రభాకర్ శనివారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైతులు ఉత్పత్తి చేసిన కోకో గింజలకు అంతర్జాతీయ మార్కెట్ ధర చెల్లించకుండా కంపెనీలు రైతులను మోసం చేస్తున్నాయని ఆరోపించారు. ఇప్పటికే కంపెనీలు, ట్రేడర్లు కోకో గింజలను తక్కువ ధరకు కొనుగోలు చేశారని మండిపడ్డారు. అంతర్జాతీయ మార్కెట్లో కోకో ధర రూ.880 ఉన్నప్పటికీ కంపెనీలు కేవలం రూ.450 ధరకు కొనడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారని వివరించారు. ప్రభుత్వం వాస్తవాలను పరిశీలించకుండా తమకు అనుకూలమైన రైతులతో మాట్లాడి ప్రస్తుతం ఉన్న పంట కొనుగోలు చేయాలని చెబుతూ రూ.450 కంపెనీలు ఇస్తాయని, రూ.50 ప్రభుత్వం చెల్లిస్తుందని ఏకపక్షంగా చెప్పటం విడ్డూరంగా ఉందని ఆరోపించారు. వ్యవసాయ శాఖ మంత్రి అచ్చంనాయుడు చెప్పినట్టు కోకో పంట మద్దతు ధర కోసం ప్రత్యేక చట్టం తెచ్చే వరకు ప్రభుత్వం జోక్యం చేసుకొని కోకో రైతులకు సరైన ధర లభించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. కంపెనీలు కొన్న ధరకు అంతర్జాతీయ మార్కెట్లో ఉన్న ధరకు ఉన్న వ్యత్యాసాన్ని కంపెనీలు చెల్లించే విధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. విదేశాల నుండి వచ్చే కోకో దిగుమతులు తక్షణం నిలిపివేయాలని కోరారు. కోకో రైతుల సమస్యలు పరిష్కారం కాని పక్షంలో రైతుల తరపున పోరాటం చేస్తామని హెచ్చరించారు.

గిరిజన విద్యా సంస్థల్లో బదిలీల కౌన్సెలింగ్

బుట్టాయగూడెం: కేఆర్‌పురం ఐటీడీఏ పరిధిలోని గిరిజన సంక్షేమ విద్యాసంస్థల్లో పనిచేస్తున్న ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, వసతిగృహ సంరక్షకులు, బోధనేతర సిబ్బంది, నాలుగో తరగతి సిబ్బందికి బదిలీ ప్రక్రియను జూన్ 2వ తేదీలోపు పూర్తి చేయనున్నట్లు ఐడీడీఏ పీఓ కె.రాములు నాయక్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. గిరిజన సంక్షేమశాఖ సంచాలకులు ఆదేశాల మేరకు మార్గదర్శక సూత్రాలకు అనుగుణంగా ఈ బదిలీ ప్రక్రియను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఒకేచోట ఐదేళ్లు పూర్తిచేసిన వారు తప్పనిసరిగా బదిలీకి అర్హులన్నారు. పరస్పర బదిలీ, బదిలీ కోసం దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు. బదిలీకి దరఖాస్తు చేసుకునేవారు ప్రస్తుతం పనిచేసే చోట రెండేళ్లు పూర్తి చేసి ఉండాలన్నారు. దరఖాస్తును ఈ నెల 27వ తేదీ సాయంత్రం 5 గంటల్లోపు గిరిజన సంక్షేమ ఉప సంచాలకులు, కేఆర్‌పురంలో సమర్పించాలని అన్నారు. సీనియారిటీ జాబితాను 28వ తేదీ సాయంత్రానికి ఐటీడీఏ కేఆర్‌పురం నోటీస్ బోర్డులో, డీవైఈఓ వాట్సాప్ గ్రూప్‌లో ప్రదర్శిస్తామని చెప్పారు.

భారీ వర్షం.. క్షేత్ర పరిసరాలు బురదమయం



తూర్పు ప్రాంతంలో మురుగు నీటిని ఊడ్చుతున్న సిబ్బంది



దీపారాధన మండప ప్రాంతాన్ని శుభ్రం చేస్తున్న సిబ్బంది

ద్వారకాతిరుమల: శ్రీవారి క్షేత్రంలో శనివారం ఉదయం కురిసిన భారీ వర్షం కారణంగా ఆలయ పరిసరాలు బురదమయమయ్యాయి. పలు ప్రాంతాల్లో వర్షపు నీరు భారీగా నిలిచిపోయింది. ఆ వైపుగా రాకపోకలు సాగించే భక్తులు ఇబ్బంది పడకూడదని దేవస్థానం అధికారులు ఆయా ప్రాంతాలను శుభ్రం చేయించారు. జంటగోపురాల సమీప ప్రాంతంతో పాటు, దీపారాధన మండప పరిసరాలు, పందిళ్లలో నిలిచిన బురదను పారిశుద్ధ్య సిబ్బంది తొలగించారు. బురద నీటిని బయటకు ఊడ్చారు. బురద నీటిలోని పీచు మ్యాట్లను తీసి శుభ్రం చేశారు.